క్లుప్తంగా



నెల్లూరుకు వచ్చిన రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించిన రాష్ట్ర ఆప్కాప్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు
–నెల్లూరు(సెంట్రల్)

వైద్య శిబిరానికి విశేష స్పందన



ముత్తుకూరు : కృష్ణపట్నం గ్రామంలో అదాని కృష్ణపట్నం పోర్టు, అదాని ఫౌండేషన్, అపోలో ఫౌండేషన్, గ్రామ పంచాయతీ సంయుక్తంగా గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో డెర్మటాలజీ, గైనకాలజీ, డెంటల్, జనరల్ ఫిజీషియన్లకు సంబంధించి 189 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. సీఎస్సార్ హెడ్ రాజేష్‌రంజన్, వైద్య నిపుణులు గాయత్రి, సుహర్షన్, కళ్యాణ్, సురేష్, కార్తీక్, టి.రవీంద్ర వారి సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు.

గిరిజనకాలనీలో ఆధార్ నమోదు

జలదంకి: మండలంలోని తిమ్మసముద్రం గిరిజనకాలనీలో ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన కుటుంబాలకు ఆధార్ నమోదు ప్రక్రియను గురువారం చేపట్టారు. ఆధార్ కార్డులు లేని వారిని గుర్తించి వారికి ఆధార్ కార్డులు అందజేశారు. ఆధార్ కార్డులో తప్పులు ఉన్న వారికి వాటిని సరిచేయించారు. కార్యక్రమంలో యానాది సంఘాల మహా కూటమి రాష్ట్ర అధ్యక్షుడు బాపట్ల వెంకటపతి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మాలకొండారెడ్డి, గిరిజన జాగృతి వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయంపు కనకయ్య, పోట్లూరి మాల్యాద్రి, తలపల శివపార్వతి, గిరిజనులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

జలదంకి: జలదంకి నూతన ఎంపీడీఓగా బత్తిన సింగయ్య తన కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన దొరవారిసత్రం ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తూ బదిలీపై జలదంకికి వచ్చారు. జలదంకి ఇన్‌చార్జి ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న శ్రీధర్‌బాబు కావలి ఎంపీడీఓ కార్యాలయ ఏఓగా నియమితులయ్యారు. నూతన ఎంపీడీఓ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.

కులగణన సర్వేకు ప్రత్యేక అధికారులు

ఉదయగిరి: మండలంలో త్వరలో నిర్వహించనున్న కులగణన సర్వే పర్యవేక్షణకు కలెక్టర్ ఆదేశాల మేరకు సచివాలయాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించినట్లు ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అప్పసముద్రం, కొండాయపాళెం సచివాలయాలకు ఈఓపీఆర్డీ ఎన్.మల్లికార్జునను, తిరుమలాపురం, వెంగళరావునగర్‌కు ఎంఈఓ-2 తోట శ్రీనివాసులును, ఉదయగిరి బిట్-1, ఉదయగిరి బిట్-2లకు పీఆర్ ఏఈ శ్రీనివాసరాజును, కృష్ణంపల్లి, నేలటూరులకు ఏపీఓ బి.శ్రీనివాసరావును, బండగానిపల్లె, శకునాలపల్లిలకు ఏఓ ఆంజనేయులునాయక్‌ను, ఉదయగిరి బిట్-3, జి.చెరువుపల్లి సచివాలయాలకు ఏపీఎం ఎండీ ఖాజారంతుల్లాను నియమించామని తెలిపారు. వీరు వలంటీర్లను, సచివాలయ సిబ్బందిని సమన్వయం చేసుకుని సర్వే పక్కాగా నిర్వహించాలని పేర్కొన్నారు.

ఆర్‌ఎస్సార్‌లో మలేషియా వర్సిటీ బృందం

బిట్రగుంట: కడనూతలలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలను మలేషియా వర్సిటీ (యూనివర్సిటీ మలేషియా కేలన్‌టన్) అధికారులు డాక్టర్ మొహమ్మద్ అబ్దుల్‌కరీం, డాక్టర్ మొహమ్మద్ ఆరీవుల్లా గురువారం సందర్శించారు. విద్య, పరిశోధనా సంబంధిత అంశాలపై పరస్పర సహకారం, సమాచార మార్పిడికి అవసరమైన చర్చల కోసం కళాశాలకు విచ్చేసిన యూఎంకే అధికారులు కళాశాలలోని వివిధ విభాగాలు, విద్యార్థులకు కల్పించిన వసతులు, అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దిన గ్రంథాలయం, ల్యాబ్‌లను పరిశీలించారు. విద్యార్థులతో వివిధ అంశాలపై ముచ్చటించారు. విద్య, పరిశోధనలపై సహకారం, సమాచార మార్పిడికి సంబంధించి కళాశాల డైరెక్టర్ డాక్టర్ రాజారెడ్డి, ప్రిన్స్‌పాల్ డాక్టర్ వీరనారాయణ రెడ్డి, కళాశాల ఏవో రమణా రెడ్డి, అన్నీ విభాగాధిపతులతో చర్చించారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

- జిల్లా సీనియర్ సివిల్ జడ్జి వాణి



కుట్టు శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న జడ్జి వాణి

నెల్లూరు రూరల్: సమాజంలో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి వాణి అన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 29వ డివిజన్‌లోని గాంధీనగర్‌లో వీఆర్వో సంస్థ కార్యాలయంలో వైఎస్సార్‌నగర్, అంబాపురం, మన్సూర్ నగర్, కొండాయపాళెం, తదితర ప్రాంతాలకు చెందిన 75 మంది మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు జడ్జి వాణి చేతుల మీదుగా గురువారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద, మధ్య తరగతి మహిళలకు కుట్టు ద్వారా జీవనోపాధి కలుగుతుందన్నారు. తమకు తాము కుటుంబాన్ని పోషించుకుని స్థాయికి చేరుతున్నారని వివరించారు. వీఆర్వో సంస్థ అసోసియేట్ డైరెక్టర్ ఇమ్మానియేల్, సంస్థ మేనేజర్ పాల్ రాజ్, ఏరియా కోఆర్డినేటర్ గోపాల్, సిబ్బంది ఆంజనేయులు, శిక్షకులు ధనలక్ష్మి, భాగ్యలక్ష్మి, షాహీద, లలితమ్మ, షాకీరా, రాజేశ్వరి పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..





మంత్రి కాకాణి, ఎంపీ వేమిరెడ్డిని సత్కరించి కృతజ్ఞతలు తెలుపుతున్న ఏఎంసీ చైర్మన్ పేర్నేటి

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని వారి నివాసాల్లో నెల్లూరు ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన పేర్నేటి కోటేశ్వరరెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డితో పాటు డైకాస్‌రోడ్డులోని నివాసంలో మంత్రి కాకాణిని, మాగుంటలే అవుట్‌లోని నివాసంలో ఎంపీ వేమిరెడ్డిని కలిసి కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట ఏఎంసీ వైస్‌చైర్మన్ ఒట్టూరు సుధాకర్‌తో పాటు కమిటీ సభ్యులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలోనే సంక్షేమం, అభివృద్ధి



దొంతాలిలో వైఎస్సార్‌సీపీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

నెల్లూరు రూరల్: గతంలో ఎన్నడూ లేని విధంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధితో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని రూరల్ మండల జేసీఎస్ కన్వీనర్ చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్ మండలం దొంతాలి గ్రామ సచివాలయంలో ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయితేనే అన్ని వర్గాలకు మరింత లబ్ధి చేకూరుతుందన్నారు. నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ట్రెయినీ కలెక్టర్ సంజనసింహ, రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్, ఎంపీపీ విజయకుమార్, పార్టీ మండల కన్వీనర్ రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ అరుణమ్మ, నాయకులు శంకరయ్య, సురేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అనిల్‌కు కృతజ్ఞతలు



ఎమ్మెల్యే అనిల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రభాకర్

నెల్లూరు రూరల్: నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్‌ను ఇస్కాన్‌సిటీలోని ఆయన నివాసంలో రాష్ట్ర సగర కుల వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన నగరానికి చెందిన మల్లిబోయిన ప్రభాకర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సగర కులస్తుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో అన్ని వర్గాల వారికి తగిన ప్రాధాన్యం కల్పిస్తున్నారని తెలిపారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మనెమ్మ

కొడవలూరు : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని చైతన్య జ్యోతి వెల్ఫేర్ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ సీహెచ్ మనెమ్మ తెలియజేశారు. మండలంలోని గండవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆ సొసైటీ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లలోపు బాలబాలికలకు ప్రత్యేక హక్కులుంటాయని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకుంటే జీవితం బాగుంటుందన్నారు. అందులో చదువుకునే హక్కు ప్రధానమైందని తెలిపారు. బాలికలు బడిలోనే ఉండాలని సూచించారు. బాలబాలికలపై అత్యాచారాలు పెరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి సమస్య ఉన్నా వెంటనే 1098 నంబర్‌కు ఫోన్ చేసి తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త దేవరకొండ సుధాకర్, ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్యామ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కులగణన సర్వేకు సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

కొడవలూరు : రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 27వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు కులగణన సర్వేను చేపడుతోందని, ఇందుకు అందరూ సహకరించాలని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ జి.జ్యోతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కులం, కుటుంబ స్థితిగతులను ఈ సర్వే ద్వారా సమగ్రంగా నమోదు చేస్తారన్నారు. దీని వల్ల ఆర్థిక స్థితిగతులను బట్టి ప్రభుత్వ పథకాలందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం కుల గణనకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ సర్వేలోనూ వలంటీర్లు కీలకపాత్ర పోషిస్తారని తెలిపారు. అదేవిధంగా వచ్చే నెలలో 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు జరుగనున్నాయన్నారు. ఈ పోటీలకు గ్రామాల్లో 15 సంవత్సరాలు నిండిన వారు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో పోటీలను మాత్రమే నిర్వహిస్తారని చెప్పారు. ఈ పోటీలపై ఆసక్తి ఉన్న వారు పేర్ల నమోదుకు సచివాలయాలకు వస్తే వారికి సూచనలు సలహాలందించాలని సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ మారంరెడ్డి సుజాతమ్మ, ఏఈలు ఎ.రమేష్, పి.సురేష్‌కుమార్, ఏఓ లక్ష్మి, ఏపీఎం రుక్మిణి, వైద్యాధికారులు జి.బాలచంద్రబాబు, లీలావతి, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మూడో యూనిట్లో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు : నేలటూరులోని శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్టులో ఒక యూనిట్ నుంచి మాత్రమే విద్యుదుత్పత్తి జరుగుతోంది. ఇందులో భాగంగా మూడో యూనిట్లో 560 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది. సాంకేతిక కారణాల వల్ల 1, 2వ యూనిట్లలో విద్యుదుత్పత్తి నిలిపివేసినట్లు ప్రాజెక్టు ఇంజినీర్లు వెల్లడించారు.

లక్ష దీపోత్సవానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

నెల్లూరు(బృందావనం): నగరంలోని వీఆర్సీ మైదానంలో డిసెంబర్ 1 నుంచి 3వ తేదీ వరకు వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్తీకమాస లక్ష దీపోత్సవ ఏర్పాట్లకు సంబంధించి భూమి పూజను టీటీడీ న్యూఢిల్లీ స్థానిక సలహా మండలి బోర్డు చైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గురువారం చేశారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఏర్పాట్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్తీకమాస లక్ష దీపోత్సవ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

తల్లి, కుమార్తె అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): తల్లి, కుమార్తె అదృశ్యమైన ఘటనపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు..సంతపేట పోలీసుస్టేషన్ పరిధిలో ప్రసన్నబాబు, స్వర్ణలత దంపతులు నివాసం ఉంటున్నారు. కుటుంబ కలహాలో మరే ఇతర కారణమో తెలియదుకాని గురువారం స్వర్ణలత తన రెండేళ్ల కుమార్తెతో కలిసి ఇంట్లోనుంచి వెళ్లిపోయింది. బాధిత కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలించారు. ఫలితం లేకపోవడంతో సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరామర్శ



మస్తానయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న మేయర్ స్రవంతి

నెల్లూరు(బారకాసు): నగర పాలక సంస్థ పరిధిలో 2వ డివిజన్‌లో పారిశుద్ధ్య కార్మికుడిగా విధులు నిర్వర్తిస్తున్న కందా మస్తానయ్య(52) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. అల్లీపురంలోని నివాసంలో ఉంచిన మస్తానయ్య మృతదేహాన్ని మేయర్ స్రవంతిజయవర్ధన్ సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నగర పాలక సంస్థ నుంచి మృతుడి కుటుంబానికి రావాల్సిన పరిహారం త్వరతగతిన అందించాలని అధికారులను ఆదేశించారు.

నేటి నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ట ఉత్సవాలు

నెల్లూరు(బృందావనం): శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలోని మీనాక్షిదేవి సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో నూతన ధ్వజ స్థంభ ప్రతిష్ట, కుంభాభిషేక మహోత్సవాలను శుక్రవారం నుంచి మూడ్రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్ గురువారం తెలిపారు. మూడ్రోజుల పాటు విశేషాభిషేకాలు, పూజలు, హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు వివరించారు.
కంచికామకోటి పీఠాధిపతులు విజయేంద్ర సరస్వతిస్వామి వారి అనుగ్రహంతో ఆదివారం ఉదయం 8.23 నుంచి 10.31 గంటలలోపు నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట, కుంభాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు వివరించారు.

దౌర్జన్యంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): స్థలం విషయమై ఓ వ్యక్తిపై దౌర్జన్యం చేసిన వారిపై వేదాయపాళెం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఆదిత్యానగర్‌కు చెందిన కోటేశ్వరరావు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ఆయన చెన్నైలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన తండ్రి కృష్ణయ్య పేరుపై ఎన్‌జీవో కాలనీలో స్థలం ఉంది. కృష్ణయ్య మరణానంతరం ఆయన పేరుపై నున్న స్థలాన్ని నెల్లూరు నగరం, రూరల్ ప్రాంతాలకు చెందిన నాని, రత్నం, సుస్మిత, శ్రీను, శ్రీధర్, గోపి, జావిద్ అహ్మద్, వేమయ్య తప్పుడు డాక్యుమెంట్లను సృష్టించారు. ఇదేమని ప్రశ్నించిన కోటేశ్వరరావుపై దౌర్జన్యం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

వైభవంగా మండల పూజోత్సవాలు ప్రారంభం



మెట్ల పడి పూజోత్సవం

నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో మండల పూజోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. కేరళ సంప్రదాయరీతిలో ధ్వజారోహణం, 18 మెట్ల పడి పూజను మంగళవాయిద్యాలు, అయ్యప్ప భక్తుల శరణుఘోషల నడుమ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం బిక్ష కార్యక్రమం నిర్వహించారు. మెట్ల పడిపూజకు పిడూరు కిషోర్‌రెడ్డి, శరణ్య దంపతులు, బిక్షకు కాటంరెడ్డి మహిధర్‌రెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు. స్వామిఅయ్యప్ప సేవా సమాజం పాలక మండలి అధ్యక్ష, కార్యదర్శులు గూడల శేషగిరిరావు, కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, సభ్యులు కేజీ శంకర్, వేలూరు సునీల్‌కుమార్‌రెడ్డి, బొగ్గల మురళీమోహన్‌రెడ్డి, ఆనం జయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాస లక్షదీపోత్సవానికి ఆహ్వానం



ఎంపీ దంపతులను సత్కరించి ఆహ్వానపత్రికలు అందజేస్తున్న జొన్నవాడ ఆలయ చైర్మన్

నెల్లూరు(దర్గామిట్ట): ఈ నెల 20న జొన్నవాడలోని కామాక్షితాయి ఆలయంలో నిర్వహించనున్న కార్తీక మాస లక్ష దీపోత్సవానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీటీడీ ఢిల్లీ స్థానిక సలహా మండలి బోర్డు చైర్‌పర్సన్ ప్రశాంతిరెడ్డి దంపతులను ఆ ఆలయ చైర్మన్ పుట్టా లక్ష్మీ సుబ్రహ్మణ్యంనాయుడు ఆహ్వానించారు. గురువారం నగరంలోని నివాసంలో ఎంపీ వేమిరెడ్డి దంపతులను కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. కార్తీక మాసం సందర్భంగా అన్నాభిషేకం, రుద్రహోమం, ప్రదోషకాల వృషభార్చన, పెన్నా హారతి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వేమిరెడ్డి దంపతులను సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట వేద పండితులు ఉన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

నెల్లూరు(బృందావనం): మూలాపేట, బ్రాహ్మణ వీధిలోని అవధూత భగవాన్ వెంకయ్యస్వామి గురు నిలయంలో దుప్పట్ల పండగ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. తలుపూరు నారాయణదాసుస్వామి, వటికనాథస్వామి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాకాని గోపి మాట్లాడుతూ వెంకయ్యస్వామి ప్రియశిష్యుడు మాకాని వెంకట్రావ్ 20 ఏళ్ల క్రితం నవంబరు 16న నిరుపేదలు, వృద్ధులు, దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని (దుప్పట్ల పండగ) ప్రారంభించారని తెలిపారు. తదానంతరం తాము సామాజిక సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది సుమారు ఐదు వేల మందికి పైగా దుప్పట్లు పంపిణీ చేయడంతో పాటు అన్నప్రసాద వితరణ చేసినట్లు తెలిపారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



నెల్లూరు(మినీబైపాస్): పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని రంగనాయకులపేట గ్రంథాలయాధికారి వాసిలి అరుణ తెలిపారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రంగనాయకులపేట గ్రంథాలయంలో గురువారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. పుస్తక ప్రదర్శనను తిలకించేందుకు వచ్చిన విద్యార్థులకు ఆమె పుస్తకాల విశిష్టతను వివరించారు.

పేర్నేటికి మేయర్ శుభాకాంక్షలు



పేర్నేటి కోటేశ్వరరెడ్డిని సత్కరించి శుభాకాంక్షలు తెలియజేస్తున్న మేయర్ స్రవంతి జయవర్ధన్

నెల్లూరు(బారకాసు): నెల్లూరు ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన పేర్నేటి కోటేశ్వరరెడ్డిని నగరంలోని ఆయన స్వగృహంలో మేయర్ స్రవంతిజయవర్ధన్ గురువారం కలిశారు. పేర్నేటికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పేర్నేటి కోటేశ్వరరెడ్డి తమకు అత్యంత ఆప్తులని, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థ ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడిగా, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించినప్పటి నుంచి అతనితో తమ ప్రయాణం కొనసాగుతోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీకి పేర్నేటి అందించిన సేవలను గుర్తించి ఏఎంసీ చైర్మన్‌గా నియమించడం సంతోషకరమన్నారు. ఆయన మరెన్నో పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన మధుతో నగర ఎమ్మెల్యే అనిల్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53వ డివిజన్ గాంధీగిరిజన కాలనీకు చెందిన డీవైఎఫ్ఐ నాయకుడు చచ్చాల మధు గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్‌యాదవ్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం తన వంతు కృషి చేస్తానని మధు తెలిపారు. ఈ కార్యక్రమంలో 53వ డివిజన్ వైఎస్సార్‌సీపీ నాయకులు బాగి వెంకటరమణ, నాగరాజు పాల్గొన్నారు.